నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంచిర్యాల సోమవారం 1 ఏప్రిల్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



కాగజ్‌నగర్ పట్టణంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న డీఎస్పీ కరుణాకర్, పోలీసు సిబ్బంది

## రూ.98,500 సీజ్

కాసిపేట, మార్చి 31 : కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమగూడెం చొప్పరిపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్ట్ వద్ద మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. గోదావరిఖనికి చెందిన అల్లివర్ అర్జున్ వద్ద రూ.98500 స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. ఈ నగదును ఎస్ఎస్టీ టీంకు అప్పగించినట్లు సీఐ శశిధర్ రెడ్డి వివరించారు.



చెక్ పోస్ట్ వద్ద నగదు పట్టుకున్న సీఐ శశిధర్ రెడ్డి, ఎస్ఐ ప్రవీణ్ కుమార్

## శాంతి భద్రతలు కాపాడడం అందరి బాధ్యత

- కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్
- పట్టణంలోని ప్రధాన చౌరస్తాల్లో ఫ్లాగ్ మార్చ్

కాగజ్‌నగర్, మార్చి 31 : శాంతి భద్రతలు కాపాడడం మనందరి బాధ్యత అని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని పాత ఫారెస్ట్ చెక్ పోస్టు నుంచి తెలంగాణ తల్లి, రాజీవ్ గాంధీ చౌరస్తా, బాలాజీనగర్, అంబేద్కర్, శ్రీరాములు చౌరస్తా, సంఘం బస్తీ, సర్‌సిల్క్, విజయబస్తీ, ఈద్గా వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ మాట్లాడుతూ ప్రజలంతా శాంతియుతంగా, సామరస్యంగా ఉండేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి వర్గా విభేదాలు, అల్లర్లు జరుగకుండా ఆయాచోట్ల అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించినా, గొడవలు సృష్టించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రాకేశ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ సంతోశ్‌కుమార్, పట్టణ సీఐ శంకరయ్య, ఎస్ఐలు మహేందర్, అంజయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నదాతల అరిగోస

## అందని 'కడెం'నీరు.. అడుగంటిన భూగర్భ జలాలు

- లక్షలు ఖర్చు పెట్టి పూడిక తీసినా ఫలితం శూన్యం
- గంట కూడా నడవని మోటర్లు..
- పొట్ట దశలో ఎండుతున్న వరి
- ఇప్పటికే పలుచోట్ల పశువుల మేతకు వదిలేసిన వైనం
- అగమ్యగోచరంగా రైతన్నల పరిస్థితి
- ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకోలు




ఎండిపోయిన వరిపంటను చూపుతున్న మాకులపేట రైతులు



బావిలో అడుగంటిన నీరు

దండేపల్లి, మార్చి 31 : మరో నెల రోజుల్లో పంట చేతి కొస్తుందని ఆశపడ్డ జిల్లా రైతాంగానికి చివరకు నిరాశే మిగులుతున్నది. కడెం నీరందక.. భూగర్భ జలాలు అడుగంటి పొట్ట దశలో ఉన్న వరి కళ్లముందే ఎండుతుండగా దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. గతేడాది రంది లేకుండా రెండు పంటలు తీసిన అన్నదాతలు, ఈసారి తీవ్రంగా నష్టపోయే దుస్థితి దాపురించింది.

### అడుగంటిన భూగర్భ జలాలు

మంచిర్యాల జిల్లాలో యాసంగిలో 62,524 ఎకరాల్లో వరి సాగు చేశారు. 50 శాతం మేర సన్నాలు, మరో 50 శాతం మేర దొడ్డు రకం పంటలు వేశారు. గతేడాది అక్టోబర్ చివరి వరకు ఆశించిన మేర వర్షాలు కురవడంతో గ్రామాల్లోని చెరువులు,కుంటలు జలకళను సంతరించుకున్నాయి. ఫిబ్రవరి, మార్చి నెలల్లోనూ చెరువులు, కుంటల్లో 70 శాతం మేర నీళ్లు ఉండడంతో పంటలు ఎండిపోకుండా చేతికొచ్చాయి. ఈ క్రమంలో ఈ యేడాది వర్షాలు సరిగా కురవకపోవడం, కడెం ప్రాజెక్టు నుంచి క్రాప్ హాలిడే ప్రకటించడం.. మార్చి రెండో వారంలోనే ఎండలు ముదరడం.. భూగర్భజలాలు అడుగంటడం..వంటి కారణాల నేపథ్యంలో పంటలు చేతికందకుండా పోయే పరిస్థితి నెలకొంది. కొందరు రైతులు లక్షలు ఖర్చు చేసి బావుల్లో పూడికతీయిస్తుండగా, మరికొందరు బోర్లు వేయిస్తున్నారు. అయినా, భూగర్భజలాలు పెరగకపోవడం, గంటసేపు మోటరు నడవంగానే నీళ్లు అయిపోతుండడంతో రైతన్నలు దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికే కొందరు రైతులు తమ పొలాలను పశువుల మేతకు వదిలేయడం ఆందోళన కలిగిస్తున్నది.

### పడిపోతున్న నీటి నిల్వలు..

గతేడాదితో పోలిస్తే ఈసారి ఎల్లంపెల్లి ప్రాజెక్టులో సుమారు 6 నుంచి 7 టీఎంసీలకు పైగా నీటి నిల్వలు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టు నుంచి తాగు, సాగునీటి కోసం విడుదల చేస్తున్నారు. కాళేశ్వరం నుంచి ఎత్తిపోతలు నిలిచిపోవడంతో గూడెం ఎత్తిపోతల పథకంలో నీటి నిల్వలు తగ్గాయి. ఎల్లంపెల్లి బ్యాక్‌వాటర్‌తో మునిగి ఉన్న గూడెం వంతెన ఫిబ్రవరిలోనే బయటపడింది. పుష్కర ఘాట్లు కూడా తేలాయి. గోదావరిలో కూడా భారీగా నీటి మట్టం తగ్గడంతో రైతులు నష్టపోయే పరిస్థితి వచ్చింది.

### పెట్టుబడి కూడా పోయేటట్టే ఉంది

గీ యాసంగిల రెండెకరాల్లో వరి వేసిన. పోయినేడాది మంచిగనే పంట చేతికొచ్చిందన్న భరోసాతో ఈసారి వేసిన. కడెం నుంచి నీళ్లు రాకపోవడంతో బావుల్లో నీళ్లు లేకుంటైనయి. నెల రోజుల్ల పంట చేతికొస్తుందని సంబుర పడుతుంటే మొత్తం ఎండిపోవట్టే. రూ. లక్ష పెట్టి బావిలో పూడిక కూడా తీయించిన. అయినా లాభం లేకుంటైంది. లక్ష నష్టంతో పాటు పెట్టుబడి కూడా పోయేటట్టే ఉంది. ఎకరం మొత్తం ఎండిపోయింది. ఇగ ఉన్న ఎకరం పొలం కూడా పండుతదన్న ఆశ లేదు.

**-గోపతి సుధాకర్(రైతు)-మాకులపేట.**



### ఐదెకరాలు ఎండిపోయినయ్

ఆరెకరాల్లో వరి వేసిన. పోయనసారి కడెం నీళ్లు రావడంతో దిగుబడి మంచిగనే వచ్చింది. గదే ఆశతో మళ్లా వరి వేసిన. ఇప్పటికే ఐదెకరాలు ఎండిపోయింది. ఎకరం మాత్రమే పొట్ట దశలో ఉంది. అది కూడా చేతికందుతుందన్న ఆశ లేదు. పంటలు కాపాడుకునేందుకు రూ.2.50 లక్షలు పెట్టి బావిలో పూడిక తీయించిన. మోటరు గంట సేపు నడువకముందే నీళ్లు అయిపోతున్నయ్. పెట్టుబడి రూ.లక్ష దాకా పోయినట్లే. కాంగ్రెస్ సర్కారు ముందు చూపు లేక ఈ పరిస్థితి దాపురించింది. నష్టపోయిన రైతులను ఆదుకోవాలె. కేసీఆర్ సర్కారు ఉన్నన్ని రోజులు రంది లేకుంట బతికినం.

**-పర్శనేని రాజగోపాల్, రైతు, మాకులపేట**





### ఇగ మా బతుకులు ఆగమేనా.

యాసంగిల రెండెకరాల్లోట్ల వరి వేసిన. కడెం నీళ్లు వస్తయన్న ఆశతోనే పంట వేసిన. నెల రోజుల్ల పంట చేతికొస్తదనుకుంటే గిట్ల ఎండిపోవట్టే. పంట అచ్చుడు పక్కన పెడితే పెట్టుబడి కూడా పోయేటట్టు ఉంది. సర్కారు ఏమాత్రం పట్టించుకోలే. వచ్చే యేడాది కూడా గిట్లనే చేస్తే మా బతుకులు ఆగమైతయ్.

**-అత్తె పోషయ్య, రైతు, మాకులపేట**



### సర్కారు ఆదుకోవాలి

యేటా 5 ఎకరాల పొలం చేసేటోన్ని. ఈ సారి రెండెకరాలే వేసిన. అండ్ల ఎకరం ఎండిపోయింది. ఎకరం నువ్వులు వేసిన. గదానికి కూడా నీళ్లు సరిపోతలేవు. మక్క కూడా గట్లనే ఉంది. మోటరు గంట కూడా నడుస్తలేదు. ఇది వరకు కడెం నీళ్లతోని గట్టెక్కినం. ఈసారి నిండా మునిగినం. ఎండిన వరిని పశువులు మేత కోసం వదిలేసిన. కాంగ్రెస్ సర్కారు రైతుల గురించి ఆలోచించాలే.

**-బత్తుల శ్రీనివాస్, రైతు, మాకులపేట**



చెట్టు కింద ఇప్ప పూలు | ఇంటి వద్ద ఆరబెట్టిన ఇప్పపూలు

## కోడి కూయక ముందే అడవిబాట

- ఇప్పపూల సేకరణలో గిరిజనుల నిమగ్నం
- ఈ యేడాది ఆశాజనకంగా పూత
- గతేడాది నిర్ణయించిన ధరకే కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్న జీసీసీ
- విలువైన ఫలం దళారుల పాలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ) : అడవితల్లి ప్రసాదించే ఇప్పపూల సేకరణ ప్రారంభమైంది. ఆదివాసులు కోడి కూయక ముందే లేచి అడవి బాట పడుతున్నారు. ఈ ఏడాది వర్షాలు ఎక్కువగానే పడగా, ఇప్పపూలు ఎక్కువగానే పూశాయి. ఎండాకాలంలో నెల రోజుల పాటు జీవనోపాధి కల్పించే ఇప్పపూల సేకరణలో అడవిబిడ్డలు నిమగ్నమయ్యారు.

### గతేడాది నిర్ణయించిన ధరకే..

ఈ యేడాది ఇప్పపూల కాత ఆశాజనకంగా ఉన్నప్పటికీ సేకరించేందుకు ఆదివాసీలు ఆసక్తి కనబర్చడం లేదు. ఓ వైపు అటవీ అధికారుల ఆంక్షలు, మరోవైపు గిరిజన సహకార సంస్థ సరైన ధర కల్పించకపోవడంతో గిరిజనులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అటవీ ప్రాంతాల్లో తమ చేల వద్ద ఉన్న ఇప్పచెట్ల వద్ద మాత్రమే పూలు సేకరిస్తున్నారు. గిరిజన సహకార సంస్థ గతేడాది నిర్ణయించిన ధరకే ఇప్పపూలు కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నది. గతేడాది నాణ్యతను బట్టి కిలోకు రూ. 10 నుంచి రూ. 12 వరకు మాత్రమే చెల్లించి జీసీసీ ద్వారా కొనుగోలు చేశారు. మారుమూల గ్రామాల్లో డీఆర్‌డిపోల ద్వారా గిరిజనుల నుంచి ఇప్పపూలను కొనుగోలు చేయాల్సి ఉంది. అయితే, ప్రచారం చేయకపోవడం, సరైన అవగాహన కల్పించకపోవడంతో దళారులు రంగంలోకి దిగి గిరిజనులను మోసం చేస్తున్నారు. ఎంతో కొంత ముట్టజెప్పి కొనుగోలు చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఉల్లిగడ్డలు, ముగ్గు, నకిలీ కాస్మొటిక్స్‌వంటివి ఇస్తూ ఎంతో విలువైన ఇప్పపూలను అతి చౌకగా కాజేస్తున్నారు. సకాలంలో మారుమూల గిరిజన గ్రామాల్లో ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, అధికారుల పర్యవేక్షణలో కొనుగోళ్లు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు. ఇప్పపూల సేకరణలో ఏదైనా ప్రమాదం జరిగితే జీసీసీ లేక అటవీ శాఖ ద్వారా తమకు భద్రత కల్పించాలని వేడుకుంటున్నారు.



అడవి నుంచి ఇప్ప పూలను సేకరించి తీసుకొస్తున్న గిరిజన కుటుంబం




నీటితో కళ కళ లాడుతున్న చెక్‌డ్యాం




నీరు లేక వెలవెలబోతున్న చెక్‌డ్యాం

## నాడు కళ కళ.. నేడు వెలవెల..

- అడుగంటిన చింతలమానేపల్లి చెక్‌డ్యాం
- నాడు రంది లేకుంట రెండు పంటలు
- ప్రస్తుతం వాగులో నీటికోసం జేసీబీలతో తవ్వకాలు

చింతలమానేపల్లి, మార్చి 31 : నాలుగేళ్ల క్రితం చింతలమానేపల్లి సమీపంలోని వాగుపై చెక్‌డ్యాం నిర్మించగా, ప్రస్తుతం పూర్తిగా అడుగంటిపోయింది. బీఆర్‌ఎస్ సర్కారు ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేసిన ఈ చెక్‌డ్యాం కింద రైతులు రంది లేకుంట యేటా రెండు పంటలు తీస్తూ వచ్చారు. నాడు నిండుకుండలా కళకళలాడిన ఈ చెక్‌డ్యాం.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వ పట్టింపులేనితనంతో చుక్క నీరు లేక వెలవెలబోతున్నది. దీనిపై ఆధారపడి 50 ఎకరాల్లో వేసిన వరి, మిరప, మక్క చేతికందకుండా పోయే దుస్థితి నెలకొంది. పంట చేతికొచ్చే దశలో ఈ పరిస్థితి తలెత్తడంతో రైతులు వాగులో జేసీబీలతో గుంతలు తవ్వి.. అందులో మోటర్లు బిగించి పంటలకు నీరందించే ప్రయత్నం చేస్తున్నారు.

## ఇంటర్ ప్రవేశ పరీక్షల్లో బెల్లంపల్లి సీవోఈ సత్తా

### ప్రీమియర్ సీవోఈల్లో 14 సీట్లు సాధించిన విద్యార్థులు



అల్తాటి వినయ్ (బైపీసీ,గౌలిదొడ్డి)



అజయ్‌కుమార్(బైపీసీ,గౌలిదొడ్డి)



డీ సాయిసిద్ధార్థ (బైపీసీ,గౌలిదొడ్డి)



గుమ్మడి ఉజ్వల్ (బైపీసీ,గౌలిదొడ్డి)

బెల్లంపల్లిరూరల్, మార్చి31 : సాంఘిక సంక్షేమ గురుకులాల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలలో వచ్చే విద్యాసంవత్సరంలో ఇంటర్‌లో ప్రవేశాల కోసం రెండు దశల్లో నిర్వహించిన పరీక్షల్లో బెల్లంపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ) విద్యార్థులు సత్తా చాటారు. సీవోఈ మొదటి దశ ప్రవేశ పరీక్షకు హాజరైన 74 మందిలో 53 మంది రెండో దశ పరీక్షకు అర్హత సాధించారు. ఇందులో 14 మంది విద్యార్థులు ప్రీమియర్ సీఈవోలలో సీట్లు సాధించారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న సీవోఈలలో ప్రవేశాల కోసం వచ్చే రెండో దశ ఫలితాల్లో మరో 15 సీట్లు సాధించి తీరుతామని ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తెలిపారు. విద్యార్థులు అల్తాటి వినయ్ (బైపీసీ–గౌలిదొడ్డి), మెరుగు అజయ్ కుమార్ (బైపీసీ–గౌలిదొడ్డి), దాగం సాయిసిద్ధార్థ (బైపీసీ–గౌలిదొడ్డి),గుమ్మడి ఉజ్వల్ (బైపీసీ–గౌలిదొడ్డి),దుగుట సౌమిత్ (బైపీసీ–గౌలిదొడ్డి), దుర్గం నవీన్ (బైపీసీ–గౌలిదొడ్డి), గోమాస అభిషేక్ (బైపీసీ–గౌలిదొడ్డి), బొల్లం అభినవ్‌తేజ్ (బైపీసీ–గౌలిదొడ్డి), జాడి ప్రఫుల్ (బైపీసీ–అల్గునూరు), గొల్లమాడ చక్రధర్(బైపీసీ–అల్గునూరు),చిలుముల రాకేశ్ (ఎంపీసీ–అల్గునూరు), దుర్గం కార్తీక్(ఎంపీసీ–అల్గునూరు), సూర్యవంశీ కిరణ్‌కుమార్ (ఎంపీసీ–చిల్కూర్), బక్కం సాయివిఘ్నేష్ (ఎంఈసీ–ఇబ్రహీంపట్నం) కళాశాలల్లో సీట్లను దక్కించుకున్నారు. సీట్లు సాధించిన బెల్లంపల్లి సీవోఈ విద్యార్థులను ఆర్సీవో కే.స్వరూపారాణితో పాటు కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

## కేటీఆర్‌ను కలిసిన నాయకులు

భైంసా/లోకేశ్వరం, మార్చి 31 : బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో పార్లమెంట్ ఎన్నికల ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు రమాదేవి, లోలం శ్యాంసుందర్, కిరణ్ కొమ్రేవార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించారు. సమన్వయ కమిటీ సభ్యులుగా నియమించడంపై ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సమన్వయ కమిటీ సభ్యులు

## కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

- గ్రామాలకు నీరివ్వాలని ఆదేశించినా పట్టించుకోని అధికారులు
- నాలుగు రోజులుగా సరఫరా కాని మిషన్ భగీరథ జలం
- బోర్లలో నీరు ఇంకిపోయి అవస్థలు పడుతున్న గిరిపుత్రులు

తాంసి, మార్చి 31 : మండలంలోని గిరిగామ, అట్నంగూడ, లింగూడ గ్రామాలకు మిషన్ భగీరథ జలం నాలుగు రోజులుగా సరఫరా కావడం లేదు. భూగర్భజలాలు అడుగంటడంతో బోర్లలో నీరు ఇంకిపోయి గిరిపుత్రులు అష్ట కష్టాలు పడుతున్నారు. ఇటీవల తలమడుగు మండలంలోని లక్ష్మీపూర్ గ్రామస్తులు కలెక్టర్ రాజర్షి షాకు తమ నీటి సమస్యను పరిష్కరించాలని విన్నవించుకున్నారు. కలెక్టర్ సంబంధిత అధికారులకు భగీరథ సమస్యలను పరిష్కరించి అన్ని గ్రామాలకు నీరు అందేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. వారంలో రెండు రోజులు మాత్రమే నీరు వస్తుందని, నీటి కష్టాలను తీర్చాలని అడవిబిడ్డలు వేడుకుంటున్నారు.



బావి వద్ద నీరు తోడుతున్న మహిళలు



## భానుడి భగభగ..

నిర్మానుష్యంగా మంచిర్యాల ఐబీ చౌరస్తా



ఎండకు తాళ లేక గొడుగుతో వెళ్తున్న విద్యార్థినులు

**మంచిర్యాల జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి.** ఉదయం తొమ్మిదింటి నుంచే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. జనం బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. మధ్యాహ్నం రోడ్లు, ప్రధాన చౌరస్తాలు నిర్మానుష్యంగా మారుతున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగులు తీసుకెళ్తున్నారు. వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు శీతలపానీయాలను ఆశ్రయిస్తున్నారు. రాగల మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. కాగా, ఇప్పుడే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

- ఫొటోలు : మంచిర్యాల స్టాఫ్ ఫొటోగ్రాఫర్